సాక్షి
ఒడిశా
శనివారం । 6 । సెప్టెంబర్ । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు: రూ. 4,32,672
- భువనేశ్వర్/పూరీ



మహేంద్ర గిరి సందర్శన
మహేంద్ర గిరులను అధికారులు సందర్శించారు. నర్సరీలు పరిశీలించారు.
- 8లో



ఉపాధ్యాయులే నిర్దేశకులు
టీచర్స్‌డే ఘనంగా జరిగింది.
ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు.
- 8లో

పిల్లలకు పెద్దలే మార్గదర్శకులు: సీఎం

- ఘనంగా రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ దినోత్సవం
- ముఖ్యమంత్రి విద్యా అవార్డు ప్రదానోత్సవం



ముఖ్యమంత్రి విద్యా అవార్డు గ్రహీతలతో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: వర్ధమాన సమాజంలో వివిధ రంగాలలో అవకాశాలు అపరిమితంగా ఉన్నాయని, పిల్లలలో ఇమిడి ఉన్న అపార ప్రతిభను గుర్తించి పెద్దలు వారి కలల సాకారానికి మార్గదర్శకులు కావాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ దినోత్సవం, ముఖ్యమంత్రి విద్యా అవార్డు ప్రదానోత్సవంలో పిలుపునిచ్చారు. స్థానిక లోక్ సేవా భవన్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన ఈ రాష్ట్ర స్థాయి వేడుకలో గొప్ప రాజనీతిజ్ఞుడు, ఆదర్శ ఉపాధ్యాయుడు, మాజీ రాష్ట్రపతి భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ముఖ్యమంత్రి నివాళులు అర్పించారు.

నేటి విద్యా వ్యవస్థలో రెండు అతిపెద్ద సవాళ్లను ఎదుర్కోవాలని, మొదటిది డ్రాపౌట్ రేటు నివారించడం, రెండోది అందరికీ నాణ్యమైన విద్య అందించడం అని సీఎం అన్నారు. డ్రాపౌట్ రేటును నియంత్రణలో మధ్యాహ్న భోజన పథకం విజయవంతమైన చర్యగా నిలిచిందన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల పౌష్టిక ఆహారంతో మధ్యాహ్న భోజన పథకాన్ని పదో తరగతి వరకు విస్తరించారని, షెడ్యూల్డ్ కులం, తెగల వర్గానికి చెందిన పిల్లలకు మాధో సింగ్ దివ్యాంగుల వ్యయ పథకం ప్రవేశ పెట్టారని తెలిపారు.. రానున్న రోజుల్లో డ్రాపౌట్ రేటును తగ్గించడంలో ఈ పథకాలన్నీ ఖచ్చితంగా విజయవంతమవుతాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కొత్త విద్యా విధానం అమలు చేసినట్లు తెలిపారు.

2036 నాటికి సంపన్న ఒడిశా నిర్మాణంలో ప్రస్తుత విద్యార్థుల ప్రతిభ ఆవిష్కరణ బలమైన పునాదిగా నిలుస్తుందని, పిల్లలను ఎలా నడిపించాలో, వారిని మంచి మనుషులుగా ఎలా తయారు చేయాలో ఉపాధ్యాయులకు బాగా తెలుసని అన్నారు. ఉపాధ్యాయుల అంకిత భావ కార్యాచరణ ఒడిశా ఆవిర్భావ శత జయంతి నాటికి సుసంపన్న ఒడిశా ఆవిష్కరణకు దోహదపడాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి ముఖ్యమంత్రి విద్యా అవార్డు కార్యక్రమంలో విద్యా రంగంలో అద్భుత ప్రదర్శనకు మొదటి స్థానంలో నిలిచిన ఝార్సుగూడ జిల్లాకు రూ. 3 కోట్లు, రెండవ స్థానంలో నిలిచిన ఖుర్దా జిల్లాకు రూ.2 కోట్లు, జగత్‌సింగ్‌పూర్ జిల్లాకు రూ.కోటి బహుమతిని ముఖ్యమంత్రి అందజేశారు.



ఒడిశా కరికులం ఫ్రేమ్‌వర్క్ ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్ - 2025 అనే కాఫీ టేబుల్ పుస్తకావిష్కరణ

ఈ సందర్భంగా 70 మంది ఉపాధ్యాయులను, 3 జిల్లా విద్యా శిక్షణ సంస్థలను, ముగ్గురు జిల్లా విద్యా అధికారులకు, 10 మంది మండల విద్యా అధికారులకు ముఖ్యమంత్రి అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నీట్ పరీక్షలో రాణించిన షెడ్యూల్డ్ తెగ వర్గానికి చెందిన ఇద్దరు విద్యార్థులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమంలో జాతీయ విద్యా విధానం ఆధారంగా ఒడిశా కరికులం ఫ్రేమ్‌వర్క్ ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్ - 2025 అనే కాఫీ టేబుల్ పుస్తకాన్ని ముఖ్యమంత్రి విడుదల చేశారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి పురస్కరించుకుని పాఢిబా, గొఢిబా ఒడిశా ప్రచార కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పాఠశాలలు, సామూహిక విద్యా విభాగం మంత్రి నిత్యానంద్ గోండ్ గురు - శిష్య సంప్రదాయం మన సమాజంలో పురాతన కాలం నుండి సుదృఢంగా కొనసాగుతుందన్నారు. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, ఆదర్శ సమాజ నిర్మాణం తదితర అంశాలపై అవగాహన కల్పించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్రధారులు కావాలన్నారు. ఉత్తమ జిల్లా అవార్డు ఝార్సుగుడ, ఖుర్దా, జగత్‌సింగ్‌పూర్, జిల్లా విద్యా అధికారులు సోన్‌పూర్ - లక్ష్మణ్ భోయ్, సుందరగడ్- అమూల్య నాయక్, బొలంగీరు- ధృబ చరణ్ బెహెరా, జిల్లా విద్య మరియు శిక్షణ సంస్థ అవార్డు ఢెంకనాల్, జగత్‌సింగ్‌పూర్, అంగుల్ అందుకున్నారు.

వామన స్వరూపంలో శ్రీ జగన్నాథుడు



భువనేశ్వర్: పూరీ శ్రీమందిరంలో శుక్రవారం బలి వామన అలంకరణలో శ్రీ జగన్నాథుడు శోభిల్లాడు. శ్రీ బలభద్ర స్వామి రాజ తీవి అలంకరణతో, దేవీ సుభద్ర సాధారణ వస్త్రధారణలో రత్న వేదికపై కొలువు దీరారు. భాద్రపద మాసం శుక్ల పక్ష ద్వాదశి తిథి పురస్కరించుకుని శ్రీ మందిరంలో మధ్యాహ్న ధూపం నిర్వహించిన తర్వాత, శ్రీ జగన్నాథ మహా ప్రభువుని బంగారు ఆభరణాలతో వామన స్వరూపంలో అలంకరించారు. బొడొ సింగారొ పూజ వరకు ఈ అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కలిగింది.

హిరాకుద్ వరద నీరు విడుదల



భువనేశ్వర్: హిరాకుద్ జలాశయం నీటి మట్టం 626.62 అడుగులు. జలాశయంలో 24 గేట్లు తెరిచి వరద నీరు విడుదల చేస్తున్నారు. హిరాకుద్ జలాశయంలోకి 4 లక్షల 23 వేల 936 క్యూసెక్కుల నీరు ప్రవేశిస్తోంది. 2,94,235 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రి రాకలో ఆలస్యం

భువనేశ్వర్: ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి 4 రోజుల కొత్త ఢిల్లీ పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణంలో స్వల్ప అసౌకర్యానికి గురయ్యారు. ముఖ్యమంత్రి ఢిల్లీ నుంచి భువనేశ్వర్‌కు బయల్దేరిన విమానం భారీ వర్షం కారణంగా స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగలేకపోయింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న విమానం కోల్‌కతాకు తరలించారు. కోల్‌కతా మీదుగా సుమారు 3 గంటల ఆలస్యంగా భువనేశ్వర్‌కు ముఖ్యమంత్రి సురక్షితంగా చేరారు.

బసంత్ కుమార్‌కు అవార్డు ప్రదానం



రాష్ట్రపతి ద్రౌపతిముర్ము నుంచి అవార్డు స్వీకరిస్తున్న బసంత్ కుమార్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాకు చెందిన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బసంత్ కుమార్ రణా జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యారు. దీంతో ఆయనకు ఢిల్లీలో శుక్రవారం జరిగిన టీచర్స్ డే సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపతిముర్ము అవార్డును ప్రదానం చేశారు. రూ. 50 వేల నగదు, ప్రశంసా పత్రాన్ని అందజేసి సత్కరించారు. కాగా బసంత్ కుమార్ రణాకు జాతీయస్థాయి అవార్డు రావడంతో జిల్లాలో ఆయన చేసిన సేవలను జిల్లా విద్యాధికారి చిత్తరంజాన్ పాణిగ్రాహి కొనియాడారు.

ప్రమాద సంకేతం దాటిన జలకా నది నీటి మట్టం



ఉప్పొంగిన జలకా నది

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లాలో జలకా నది నీటి మట్టం గణనీయంగా పెరిగింది. బొస్తా ప్రాంతం మథాని సమీపంలో ప్రమాద సంకేతం అధిగమించి వరద నీరు ఉప్పొంగుతోంది. ఈ నది ప్రమాద సంకేతం 6.50 మీటర్లు కాగా ప్రస్తుత నీటి మట్టం 6.71 మీటర్లు కొనసాగుతోంది. బొస్తా మండలంలో 10 పంచాయతీలు ప్రభావితం అయ్యాయి.

పారాదీప్ ఓడ రేవులో ఒకరు గల్లంతు

భువనేశ్వర్: జగత్‌సింగ్‌పూర్ జిల్లా పారాదీప్ ఓడరేవు వద్ద శుక్రవారం ఉదయం దుర్ఘటన చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో ప్రమాదవశాత్తు ఇద్దరు సిబ్బంది ఓడ నుంచి జారి సముద్రంలో మునిగి పోయారు. వారిలో ఒకరు గల్లంతయ్యారు. మరో వ్యక్తిని తక్షణమే గాలించి ఒడ్డుకు చేర్చారు. ఓడ రేవు 5వ నంబర్ గేటు సమీపంలోని పీఐసీటీ బెర్త్ వద్ద ఈ సంఘటన జరిగింది. ఓడ బెర్త్ నుంచి బయల్దేరిన తర్వాత సిబ్బంది నిచ్చెనను తొలగిస్తుండగా దురదృష్టవశాత్తు పడిపోయి ఉంటారని భావిస్తున్నారు. ఈ సంఘటన తర్వాత, వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. కొద్దిసేపటికే ఒకరిని రక్షించారు. ఓడ నుంచి పడిపోయిన మరొక సిబ్బంది జాడ కోసం గాలిస్తున్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సీఐఎస్ఎఫ్, మెరైన్ థాణా పోలీసులు, స్కూబా డైవర్లు, కోస్ట్ గార్డ్ బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నాయి.

కాలువలో కొట్టుకుపోయిన బాలుడు మృతి



బాలుని ఒడ్డుకు చేర్చిన అగ్నిమాపక సిబ్బంది

భువనేశ్వర్: నగరం శివార్లలోని దారుతెంగొ గ్రామం సమీపం కాలువలో ఒక బాలుడు కొట్టుకుపోయాడు. ఎనిమిది మంది తోటి విద్యార్థులలో కలిసి స్నానం చేస్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. సమాచారం అందడంతో అగ్నిమాపక దళం కాలువలో దూకి గల్లంతైన బాలుని కోసం గాలించింది. దాదాపు గంటసేపు నిర్విరామంగా గాలించి అపస్మారక స్థితిలో ఉన్న బాలుని ఒడ్డుకు చేర్చారు. తక్షణమే చికిత్స కోసం చేరువలో ఉన్న ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు బాలుడు చనిపోయినట్లు ప్రకటించారు.

కొలాబ్ నదిపై వంతెన నిర్మించాలి



ఆందోళన చేస్తున్న కొలాబ్ వంతెన సురక్షా మంచ్ శ్రేణులు

జయపురం: పాత్రోపుట్ సమీపంలోని కొలాబ్ నదిపై ఉన్న ప్రాచీన ఇనుప వంతెనను పరిరక్షించడంతో పాటు అక్కడ నూతనంగా వంతెన నిర్మాణం చేపట్టాలని బొయిపరిగుడ, లమతాపుట్ సమితుల ప్రజలు కొలాబ్ బ్రిడ్జి సురక్షా మంచ్ నేతృత్వంలో వంతెన వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. దీంతో వంతెనకు ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అనేక ప్రాంతాలకు రాకపోకలు సాగించే ఈ వంతెన శిథిలావస్థకు చేరుకుందని పేర్కొన్నారు. బ్రిటీష్ పాలనలో నిర్మించిన వంతెనను పాలకులు నిర్లక్ష్యం చేశారన్నారు. ప్రస్తుతం ఈ వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణానికి టెండర్లు పిలిచారన్నారు. అయితే అనంతరం టెండర్ రద్దు చేశారని, వెంటనే టెండర్ పిలిచి వంతెన నిర్మించాలని కోరారు. వెంటనే వంతెన నిర్మాణం చేపట్టకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఆటో బోల్తా.. విద్యార్థులకు గాయాలు



ఆటో బోల్తా పడిన ఘటనలో గాయపడిన విద్యార్థులు

రాయగడ: పాఠశాల నుంచి ఇంటికి ఆటోలో తిరిగి వస్తున్న సమయంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థులు గాయపడ్డారు. గుణుపూర్‌లో ఈ ఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న పది మంది విద్యార్థులు పాఠశాల నుంచి ఇంటికి ఒక ఆటోలో తిరిగి వస్తున్న సమయంలో విక్రమపూర్ సమీపంలోని మలుపులో ఆటో బోల్తా పడింది. దీంతో ఇందులో ఉన్న విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన విద్యార్థులను గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రికి తరలించారు. అయితే ఇందులో ఇద్దరి పరిస్థితి ఆందోళకరంగా ఉండటంతో వారిని పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం తరలించినట్లు సమాచారం. ఆటో డ్రైవరును అదుపులోకి తీసుకున్నారు.

గజపతి జిల్లాలో రఘువీరా రెడ్డి పర్యటన



పర్లాకిమిడిలో సీడబ్ల్యూసీ సభ్యులు, మాజీ మంత్రి రఘువీరా రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే దాశరథి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ సభ్యులు ఎన్.రఘువీరా రెడ్డి

పర్లాకిమిడి: రాష్ట్రంలో వచ్చే 2029 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తెస్తామని మాజీ మంత్రి, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరా రెడ్డి అన్నారు. అలాగే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాలతో 2029 లోకసభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాన మంత్రిని చేయడం తమ లక్ష్యం అని రఘువీరా రెడ్డి విలేకరుల సమావేశంలో అన్నారు. ఆయన పర్లాకిమిడిలో శుక్రవారం పర్యటించారు. ఆయనకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మోహన ఎమ్మెల్యే దాశరథి గోమాంగో ఘన స్వాగతం పలికారు. ఎస్.రఘువీరా రెడ్డి జంగం వీధి వద్ద ఆర్.ఆర్ కల్యాణ మండపంలో తొలుత ప్రెస్‌మీట్ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సంఘటన్ శ్రీజాన్ అభియాన్ కార్యక్రమం గజపతి జిల్లాలో రెండు నియోజకవర్గాలు, ఏడు సమితి కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ సమీక్షా సమావేశాలు జరిపి పార్టీ పటిష్ఠతకు ప్రతి కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్‌లు, బూత్ లెవల్‌లో సభ్యుల్ని కలుస్తానన్నారు. పర్లాకిమిడి నియోజకవర్గంలో 15 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా, ఆరు సార్లు కాంగ్రెస్ పార్టీ గెలుపొందిందని, అలాగే మోహన నియోజకవర్గంలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నాయకులు దాశరథి గోమాంగో శాసనసభ్యులుగా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. గత లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాలు కొద్ది సీట్ల తేడాతో అధికారం కోల్పోయిందని తెలిపారు. గజపతి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతులు, సోషల్ మీడియాను వచ్చే ఎన్నికల్లో ఉపయోగించుకుంటామని అన్నారు.



ఎన్.రఘువీరా రెడ్డిని సత్కరిస్తున్న పురపాలక మాజీ ఉపాధ్యక్షుడు సంజయ్ అధికారి



విలేకరుల సమావేశంలో ఎన్.రఘువీరా రెడ్డి

జిల్లాలో గుమ్మా, గుసాని, కాశీనగర్, రాయఘడ, ఆర్.ఉదయగిరి, మోహనాలలో ఏడు రోజుల పాటు పర్యటించి తుది నివేదిక ఏ.ఐ.సి.సి.అధ్యక్షుడు ఖర్గేకు పంపిస్తానని రఘువీరా రెడ్డి అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మోహనా ఎమ్మెల్యే దాశరథి గోమాంగో, పి.సి.సి ప్రతినిధి కృష్ణచంద్ర పతి, పూరీ జిల్లా మహిళా కాంగ్రెస్ అబ్జర్వర్ నిరుపమా పాత్రో, శంకర్‌సం ఖుటియా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో హెలీపోర్ట్‌లను ఏర్పాటు చేయాలి: గవర్నర్



రాజ్ భవన్‌లో గవర్నర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం

భువనేశ్వర్: రాష్ట్రంలో రెండు, మూడు ప్రదేశాల్లో హెలిపోర్ట్‌లను ఏర్పాటు చేయాలని గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) ప్రాతిపదికన ఈ చర్యకు నడుం బిగించాలని ప్రోత్సహించారు. రాష్ట్ర యాజమాన్యంలోని ఎయిర్‌స్ట్రిప్‌లలో రన్‌వేలను విస్తరించి పెద్ద విమాన కార్యకలాపాలను సులభతరం చేయాలన్నారు. రాజ్ భవన్ నూతన అభిషేక్ హాల్‌లో రాష్ట్రంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ), రైల్వే, విమానయాన ప్రాజెక్టుల స్థితిగతులపై జరిగిన సమీక్ష సమావేశానికి అధ్యక్షత వహించిన సందర్భంగా గవర్నర్ ఈ ప్రతిపాదన చేశారు. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి అంతర్జాతీయ విమానాల రవాణా విస్తరణ వ్యవస్థని సమీక్షించారు.

హెలిపోర్ట్‌లను ప్రవేశపెడితే ప్రయాణ వ్యయ ప్రయాసల్ని కుదించి సాధారణ ప్రజలకు ప్రత్యామ్నాయ ప్రయాణ సౌకర్యంగా విస్తృత ఆదరణ పొందుతాయన్నారు. ప్రధానంగా రోడ్డు మార్గంలో పలు ప్రాంతాల ప్రయాణానికి 6 నుండి 8 గంటలు పట్టే ప్రదేశాల్లో హెలిపోర్టుల ఏర్పాటు ఉభయతారకంగా ఉంటుందని వివరించారు. ఒడిశా పర్యాటక రంగం సామర్థ్యం పెంపొందించేందుకు ఓడ రేవులలో క్రూయిజ్ టెర్మినల్‌ల అభివృద్ధి దోహదపడుతుందన్నారు. అలాంటి విధానం సమయాన్ని ఆదా చేస్తుందని, క్రూయిజ్ షిప్‌లను ఆకర్షిస్తుందని పేర్కొన్నారు. మత్స్యకారుల జీవనోపాధి పరిరక్షణ కోసం ఓడ రేవులలో ఫిషింగ్ జెట్టీలను చేర్చాల్సిన అవసరాన్ని అధికారులకు వివరించారు. భౌతియాలో పైలట్ల డ్రైవింగ్ శిక్షణ సంస్థ ప్రేరణతో ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు, ఐటీఐలలో డ్రైవింగ్ శిక్షణ కోర్సులను ప్రవేశ పెట్టి దేశ, విదేశాల్లో విద్యార్థుల ఉపాధి వనరుల మెరుగుదల పట్ల దృష్టి సారించాలన్నారు.

రైల్వే ప్రాజెక్టులను సమీక్షించిన గవర్నర్ భువనేశ్వర్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధితో తదనంతర పురోగతి గురించి ఆరా తీశారు. ఈ కార్యకలాపాల్లో రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు అవసరమని రైల్వే అధికారులకు సూచించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్వహణ, విస్తరణ కార్యకలాపాల్ని ప్రతిబింబించే రీతిలో ఎలక్ట్రిక్ వెహికల్ ఛార్జింగ్ స్టేషన్లు తదితర సౌకర్యాలు వినియోగదారులకు అందుబాటులోకి తేవాలని ఎన్‌హెచ్‌ఏఐ వర్గాలకు ఆదేశించారు. ఎన్‌హెచ్‌ఏఐ, రైల్వేలు, విమానయాన విభాగాల్లో తలెత్తే సమస్యలను సకాలంలో పరిష్కరించి త్వరితగతిన అమలు చేయడం కోసం విభాగాల మధ్య మెరుగైన సమన్వయం కొనసాగించాలని గవర్నర్ పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారి, వాణిజ్యం మరియు రవాణా విభాగం మంత్రి బిభూతి భూషణ్ జెనా, తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్, బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం డైరెక్టర్ ప్రసన్న ప్రధాన్, ఎన్‌హెచ్‌ఏఐ ప్రాంతీయ అధికారి వీరేంద్ర సింగ్, అటవీ, పర్యావరణ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సత్యవ్రత సాహు, రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక సహాయ కమిషనర్, వాణిజ్య-రవాణా శాఖ ప్రముఖ కార్యదర్శి, నిర్మాణ శాఖ ప్రముఖ కార్యదర్శి, గవర్నర్ కమిషనర్, కార్యదర్శి రూపా రోషణ్ సాహు తదితర అనుబంధ శాఖలు, విభాగాల పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక భేటీ



న్యూఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా వీరి మధ్య ఒడిశా అభివృద్ధి ప్రాజెక్టులు మరియు సమృద్ధి ఒడిశా ఆవిష్కరణకు సంబంధించి చర్చ జరిగినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.
- భువనేశ్వర్

దివ్య సింగ్ దేవ్ స్వర్ణ ముద్ర



శ్రీక్షేత్రం పాలకులుగా గజపతి మహారాజులు కొనసాగుతున్నారు. ఈ వంశీకులు జగతి నాథుని తొలి సేవకులుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం మహారాజా దివ్యసింగ్ దేవ్ పూరీ గజపతిగా రాజాధికారంలో ఉన్నారు. ఆయన రాజ్యాధికారం 69వ ఏటకు చేరిన సందర్భంగా సరికొత్త స్వర్ణ ముద్రని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్కళీయ 1433వ సంవత్సరం ఆరంభమైనట్లు పరిగణించారు.
- భువనేశ్వర్

క్లుప్తంగా

కార్పొరేట్ గుప్పిట్లో మెడికల్ కాలేజీలు


దుంపల లక్ష్మణరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మెడికల్ కాలేజీలను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని వైఎస్సార్ సీపీ కళింగ కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను అందుబాటులోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అందులో పది కాలేజీలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడం వల్ల సుమారు 1500 మెడికల్ సీట్లు కోల్పోయే దుస్థితి నెలకొందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో విలేజ్ క్లినిక్స్, అర్బన్ హెల్త్ క్లినిక్స్, 3256 రోగాలను ఆరోగ్యశ్రీలో చేర్చి పేదలకు ఆసరాగా నిలిచారని గుర్తు చేశారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అప్రజాస్వామికం


పొన్నాడ రుషి

శ్రీకాకుళం రూరల్: రాష్ట్రంలో పది మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అప్రజాస్వామికమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నాడ రుషి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాడు దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆలోచన విధానం మేరకు ప్రతి ఇంట్లో ఒకరు డాక్టర్ విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అదే పరంపర కొనసాగిస్తూ 2019లో ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు మెడికల్ విద్యకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

రిమ్స్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న అప్పలనాయుడు

శ్రీకాకుళం: రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎస్.అప్పలనాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ధర్మశ్రీ నుంచి బాధ్యతలు చేపట్టారు. అప్పలనాయుడు గతంలో విజయనగరంలో ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లతో సమావేశమై కళాశాల వివరాలను తెలుసుకున్నారు.

ఎఫ్‌డీఓకు పదోన్నతి


డి.గోపీకృష్ణ

అరసవల్లి: జిల్లా మత్స్యశాఖలోని ఫిష్ సీడ్ ఫామ్‌లో ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (ఎఫ్‌డీవో)గా విధులు నిర్వర్తిస్తున్న డి.గోపీకృష్ణకు విజయవాడ కమిషనరేట్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్‌నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎఫ్‌డీవోగా సేవలందించిన గోపీకృష్ణకు పదోన్నతి లభించడంపై సిబ్బంది, మత్స్యకారుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు.

వాస్తవికతకు దగ్గరగా 'కన్యాకుమారి'


సక్సెస్ మీట్‌లో చిత్ర యూనిట్‌కు సత్కారం

శ్రీకాకుళం అర్బన్: ఉత్తరాంధ్ర వాస్తవికతకు దగ్గరగా కన్యాకుమారి చిత్రం రూపొందించడం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. శ్రీకాకుళంలోని రామలక్ష్మణ కూడలి వద్ద ఓ హోటల్లో శుక్రవారం 'కన్యాకుమారి' చిత్రం సక్సెస్ మీట్‌ను చిత్ర నిర్మాతల్లో ఒకరైన అట్టాడ అప్పలనాయుడు నిర్వహించారు. చిత్ర నటులు అగ్గున బాబూరావు, జ్యోతి బత్తుల, గిరిజ శంకర్, తిరుమలరావు, సాహితీవేత్తలు కె.శ్రీనివాస్, ఉదయ్‌కిరణ్, న్యాయవాది మామిడి క్రాంతి, దాసరి రామచంద్రరావు, డాక్టర్ సతీష్ కుమార్ తదితరులు హాజరయ్యారు. శ్రీకాకుళం యాస, సంస్కృతి, రైతును హీరోగా చూపడం చిత్రం గొప్పతనమన్నారు. చిత్ర దర్శకుడు అట్టాడ సృజన్‌కు మంచి భవిష్యత్ ఉందన్నారు. ఈ నెల 17 నుంచి అమెజాన్ ప్రైమ్, ఈటీవీ విన్, ఆహా ఓటీటీల్లోనూ రిలీజ్ అవుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు వాన కృష్ణచంద్, ఆగూరు ఉమామహేశ్వరరావు, కొమ్ము రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే.. సమాజ నిర్దేశకులు

- రాయగడ కలెక్టర్ అశుతోష్ కులకర్ణి


రాయగడ: ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కలెక్టర్ కులకర్ణి, పక్కనే డీఈవో నాహక్ తదితరులు

రాయగడ: ఉపాధ్యాయులే సమాజ నిర్దేశకులని రాయగడ జిల్లా కలెక్టర్ అశుతోష్ కులకర్ణి అన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దేది కూడా వారేనన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయుల దినోత్సవాన్ని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యమంత్రి శిక్షా పురస్కార్-25 కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు మంచి భవిష్యత్‌ను అందించడంతోపాటు వారు సమాజంలో ఉన్నత స్థానాన్ని సంపాదించుకునేందుకు ఉపాధ్యాయుని పాత్ర చాలా కీలకమన్నారు. విద్యావిధానంలో ప్రభుత్వం తీసుకువస్తున్న మార్పులను అందుకోవడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. డ్రాపవుట్‌ల సంఖ్యను తగ్గించాలన్నారు. అందరూ చదువుకోవాలనే నినాదాలతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలోని 25 మంది ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి శిక్షా పురష్కార్-25 అవార్డులను ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, జిల్లా విద్యాశాఖ అధికారి రామచంద్ర నాహక్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి అసీమా రావ్ పాల్గొన్నారు.

- స్థానిక సాయిప్రియ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో విశ్రాంత ఉపాధ్యాయుడు డాక్టర్ బాబూరావు మహంతి దంపతులను సభ్యులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు సమాజానికి అందిస్తున్న సేవల గురించి వాకర్స్ క్లబ్ సభ్యులు ప్రశంసించారు.


రాయగడ: డాక్టర్ బాబూరావు మహంతి దంపతులను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు


జయపురం: వేదికపై ఎమ్మెల్యే బాహిణీపతి


జయపురం: ఉత్తమ ఉపాధ్యాయుడుని సత్కరిస్తున్న అతిథులు


జయపురం: స్వాతంత్ర్య సమరయోధుడు గదాధర మహాపాత్రో చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

గురువులే కీలకం: ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

జయపురం: ఉత్తమ సమాజ నిర్మాణంలో గురువులనదే ప్రధాన పాత్ర అని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ది ఇన్‌టీక్ కొరాపుట్ చాప్టర్‌చే టీచర్స్ డే (గురు దివస్)ను నిర్వహించారు. కొరాపుట్ కౌన్సిల్ ఆఫ్ ఎనలైటికల్ ట్రైబుల్ స్టడీస్ (కోట్స్)ది, ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్(ది ఇన్‌టీక్), కొరాపుట్ చాప్టర్ లు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. దేశ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా పాటిస్తున్నట్లు వెల్లడించారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో పునాదులైన విద్యార్థులకు గుణాత్మక విద్య నేర్పి ఉత్తమ పౌరులుగా దేశానికి అందించే ఉపాధ్యాయులు సమాజానికి దైవం లాంటి వారన్నారు. అటువంటి ఉపాధ్యాయులను పూజించటం మనం ఇచ్చే గౌరవం అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సుభాష్ మిశ్ర, మగుణి బెహర, నరశింగ మిశ్ర, ఉపేంద్ర పాత్ర, గణేష్ పాత్రో, గౌరీ రథ్, ప్రకాశ్ చంద్ర పట్నాయక్, సురేంద్ర పట్నాయక్, లక్ష్మీకాంత మిశ్ర, ప్రకాశ్ మహానందియ, నారాయణ సాగర్‌లను సన్మానించి.. వారు సమాజానికి అందించిన విద్యాసేవలను ప్రశంసించారు. ది ఇన్‌టీక్ కొరాపుట్ చాప్టర్ కోఆర్డినేటర్ పిసి మహాపాత్రో అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానిక విక్రమదేవ్ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ మహేశ్వర్ చంద్ర నాయిక్ గౌరవ అతిథిగా పాల్గొని టీచర్స్ డే ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా రచయిత డాక్టర్ పరేష్ రథ్ రచించిన ప్రముఖ స్వాతంత్ర్య యోధులు గధాదర మహాపాత్రో (ఐఎన్ఏ) జీవిత చరిత్ర పుస్తకాన్ని ఎమ్మెల్యే బాహిణీపతి ఆవిష్కరించారు.

మహేంద్రగిరి సందర్శన


మహేంద్రగిరి పర్వతం సందర్శనలో అధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా పర్లాకిమిడి అటవీ డివిజన్‌కు ఒడిశా ప్రధాన ముఖ్యవన సంరక్షులు సురేష్ పంత్ మహేంద్రగిరి, రామగిరి, మహేంద్రగడ గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఆయన పర్యటనలో పలు నర్సరీలు సందర్శించి వాటిని సంరక్షించే తీరును ప్రసంసించారు. అనంతరం మహేంద్రగిరి పర్వతాన్ని సందర్శించి రుద్రాక్ష మొక్కలు నాటారు. ఆయన వెంట జిల్లా అటవీశాఖ అధికారి కె.నాగరాజు, ప్రాంతీయ వనసంరక్షులు (బరంపురం) విశ్వనాథ్ నీలాంబరో, ప్రభుత్వ అసిస్టెంటు వనసంరక్షులు అరుణ్‌కుమార్ సాహు, ఏ.సి.ఎఫ్. షైనీశ్రీ దాస్ ఉన్నారు.


కోయిపూర్ నర్సరీని సందర్శించిన చీఫ్ కన్జర్వేటర్ సురేష్‌పంత్

వృథాగా తాగునీరు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్‌లో నిర్మిస్తున్న మెగా తాగునీటి ప్రాజెక్టుకు సంబంధించిన భూగర్భ పైప్ లైన్ పగిలిపోవడంతో నీరు వృథాగా పోయింది. శుక్రవారం బిసంకటక్‌లోని కోర్టు వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. పైపులైన్ నిర్మాణంలో భాగంగా నాసిరకం పైపులు వినియోగించడంతో నీటి సరఫరా ఒత్తిడి వలన వైపు పగిలిపోయినట్లు తెలుస్తోంది. సమాచారం తెలుసుకున్న గ్రామీణ నీటి పారుదల శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మరమ్మతులు చేపట్టారు.


నీరు వృథాగా పోతున్న దృశ్యం

కంసారిగుడలో అత్యాధునిక పశువైద్యశాల


ఒప్పంద పత్రాలతో కర్మాగారం యూనిట్ హెడ్ మజూర్ బేగ్‌తో, సెంచూరియన్ విశ్వవిద్యాలయం అధినేతలు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీలోని కంసారిగుడలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన పశువైద్యశాల ఏర్పాటుకు సన్నహాలు ప్రారంభమయ్యాయి. టికిరిలోని ఉత్కళ అల్యూమిన కర్మాగారం ఈ మేరకు శుక్రవారం సెంచురియన్ విశ్వవిద్యాలయం ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ సహకారంతో ఒప్పందాలను కుదుర్చుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషణ పట్ల ఉత్సాహం పెంచడంతో పాటు స్థిరమైన జీవనోపాధిని అందించడంలో అలూమిన కార్మాగారం యాజమాన్యం ముందడుగు వేయడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పాడి పశువుల సంరక్షణ చర్యల్లో భాగంగా ఆధునిక సౌకర్యాలు గల పశువైద్య శాలను ఏర్పాటు చేసి పాడి రైతులను ఆదుకోవాలన్న సదుద్దేశ్యంతో సన్నహాలు చేస్తున్నట్లు కర్మాగారం యాజమాన్యం ఈ మేరకు పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. అదేవిధంగా పశువైద్యశాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ హెల్త్ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేసేందుకు సంసిద్ధమవుతుంది. కంసారిగుడ గ్రామంతో పాటు సమీపంలోని సుమారు 50 గ్రామాలు ఈ సౌకర్యాలను పొందే అవకాశం ఉన్నట్లు ప్రకటనలో పేర్కొంది. ఉత్కళ అల్యూమిన కార్మాగారం యూనిట్ హెడ్ మూర్ బేగ్ వివరిస్తు పశువైద్య సేవలు, పశు సంరక్షణ వంటి వాటిలో గణనీయమైన మార్పులు వస్తాయని వివరించారు. కర్మాగారానికి చెందిన సీఎస్ఆర్ ద్వారా పాడి రైతులను ఆదుకునేందుకు చేపడుతున్న చర్యల్లో ఇదోభాగమని వివరించారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయం అధ్యక్షుడు డాక్టర్ ముక్తి కాంత్ మిశ్రా, సీయూటీఎం డైరెక్టర్ అరుంధతి బిస్వాల్ తదితరులు ఒప్పంద కార్యక్రమంలో పాల్గొన్నారు.

అలరించిన జానపద కళా నృత్యాలు


సంబల్‌పురి జానపద నృత్యం


సంబల్‌పురి డ్యాన్సులో కళాకారులు


నువాఖయి భేటోఘాట్ నృత్యాలు వీక్షిస్తున్న అధికారులు


జానపద నృత్య ప్రదర్శన

పర్లాకిమిడి: జిల్లా స్థాయి నువాఖయి భేట్‌ఘాట్-2025 ఉత్సవాలు స్థానిక టౌనుహాల్‌లో సమలాయి నృత్య పరిషద్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిధిగా ఏడీఎం ఫాల్గుణీ మఝి విచ్చేసి మాట్లాడారు. ఒడిశాలో సాహిత్యం, జానపద, ఒడిస్సీ నృత్యాలు ప్రపంచ ప్రఖ్యాత గాంచినవని అన్నారు. గౌరవ అతిథిగా పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్, రఘునాథ పాత్రో, సమాలాయి నృత్యపరిషత్ కార్యదర్శి నృసింహాచరణ్ పట్నాయక్, ఆదర్శదాస్ తదితరులు పాల్గొన్నారు. నువాఖయి ఉత్తర ఒడిశా అతి ముఖ్యమైన పెద్ద పండుగ. ఈ సందర్భంగా సమాలాయి నృత్య పరిషత్ ఇతర స్థానిక కళాకారులచే సంబల్‌పురి, బర్‌ఘడ్, ఒడస్సీ జానపద నృత్యాలను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఉత్తమ నృత్య కళాకారులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలతో ఏడీఎం. మఝి సత్కరించారు.

22 మంది ఉపాధ్యాయులకు పురస్కారాలు


మాట్లాడుతున్న మోహనా ఎమ్మెల్యే దాశరథి గోమాంగో


ముఖ్యమంత్రి ఉపాధ్యాయ పురస్కారం అందుకుంటున్న సౌమ్యప్రసాద్‌నాయక్

పర్లాకిమిడి: గజపతి జిల్లాస్థాయి గురుదివాస్ ఉత్సవాలు, ముఖ్యమంత్రి శిక్షపురస్కారాలు సత్కార సమావేశం స్థానిక మహేంద్రగిరి పురపాలక ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగాయి. ఈ ఉత్సవాలకు పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, మోహానా ఎమ్మెల్యే దాశరథి గోమాంగో, పురపాలక సంఘం అధ్యక్షురాలు నిర్మలా శెఠి, జిల్లా పరిషత్తు సీఈవో శంకర కెరకెటా, జిలా పరిషత్ చైర్మన్ గవర తిరుపతి రావులు అతిథులుగా విచ్చేయగా.. జిల్లా ముఖ్య విద్యాధికారి డాక్టర్ మాయా ధర్ సాహు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శిక్షా పురస్కారాలు జిల్లాలో 22 మంది ఉపాధ్యాయులకు ముఖ్య అతిథులు పర్లాకిమిడి, మోహానా ఎమ్మెల్యేల చేతులమీదుగా అందజేశారు. అందులో ఏడుగురు ప్రాథమిక, 14 మంది మాధ్యమిక ఉపాధ్యాయులు, ఒక సీఆర్‌సీసీ పురస్కారాలు అందుకున్న వారిలో ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కోఆర్డినేటరు ఎ.రవికుమార్, ఆదనపు జిల్లా శిక్షాధికారి ఎస్.గిరిధరి, డైట్ (గజపతి) ప్రిన్సిపాల్ ప్రదీప జెన్నా పాల్గొన్నారు.


పురస్కారం అందుకుంటున్న నువాగడ ఉపాధ్యాయిని సస్మితా బెహేరా

మహిళ మృతదేహం స్వాధీనం

రాయగడ: జిల్లాలో మునిగుడ పోలీస్‌స్టేషన్ పరిధి రామనకుపులి సమీపంలోని కాలువలో ఒక మహిళ మృతదేహాన్ని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. మృతురాలు బిసంకటక్ పోలీస్‌స్టేషన్ పరిధి ఘంటికాల్ గ్రామానికి చెందిన మేంద్రాని హిసాబ్ (65)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాలువలో మహిళ మృతదేహం చూసిన కొందరు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మహిళ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే గత 30వ తేదీ నుంచి మహిళ ఆచూకీ కనిపించడం లేదని ఆమె బంధువులు బిసంకటక్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి గాయాలు

మందస: నారాయణపురంలో శుక్రవారం ఎలుగుబంటి దాడిలో గొరకల పాపారావు అనే వ్యక్తి గాయపడ్డాడు. తోట నుంచి వస్తుండగా ఒక్కసారిగా దాడి చేయడంతో నడుము భాగంలో గాయాలయ్యాయి. ఆ సమయంలో చేతిలో కర్ర ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. క్షతగాత్రుడిని హరిపురం సీహెచ్‌సీకి తరలించారు. గ్రామాల్లో ఎలుగుబంట్ల సంచారంపై ఉద్దానం ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.


నారాయణపురంలో ఎలుగుబంటి సంచారం

బంగారం కోసమే బలిగొన్నారా?


వెంకట పార్వతీశం గుప్తా(ఫైల్)

శ్రీకాకుళం రూరల్: నరసన్నపేటకు చెందిన బంగారం వ్యాపారి వెంకట పార్వతీశం గుప్తా(45) అదృశ్యం మిస్టరీ ఎట్టకేలకు వీడింది. శ్రీకాకుళం రూరల్ పరిధిలోని పెదపాడు వద్ద రామిగెడ్డలో శుక్రవారం ఉదయం 11 గంటలకు గుప్తా మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. బంగారం కోసమే ఈ హత్య జరిగినట్లు పోలీసులు, స్థానికులు అనుమానిస్తున్నారు. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.. నరసన్నపేటకు చెందిన గుప్తా బంగారాన్ని హోల్‌సేల్‌గా కొనుగోలు చేస్తూ నరసన్నపేటతో పాటు శ్రీకాకుళంలోని పలు షాపులకు విక్రయించేవారు. ఈయన వద్ద డ్రైవర్ సంతోష్ ఐదేళ్లుగా పనిచేస్తున్నాడు. గుప్తా వద్ద బంగారం కాజేయాలనే ఉద్దేశంతో సంతోష్ తన స్నేహితుడు కార్ డెకార్స్ యజమాని రాజుతో కలిసి ప్లాన్ వేశాడు.

ఆ రోజు ఏం జరిగిందంటే..

ఆగస్టు 26న విశాఖపట్నంలోని ఓ బంగారం దుకాణం వద్ద కేజీన్నర బంగారాన్ని గుప్తా కొనుగోలు చేశారు. విశాఖపట్నం నుంచి తన కారులో బంగారాన్ని తీసుకొస్తుండగా శ్రీకాకుళంలోకి రాగానే డ్రైవర్ సంతోష్‌తో పాటు ఆదిత్య డెకార్స్ యజమాని రాజు కలిసి పెదపాడు వద్ద కారుషెడ్‌లోనే దారుణంగా హత్య చేశారు. ఆగస్టు 26 నుంచి ఎడతెరిపిలేకుండా వర్షాలు కురవడం, కాలువలు, గెడ్డలు గుండా పెదపాడు పరిసర ప్రాంతమంతా అత్యధికంగా నీటి ప్రవాహం ఉండటంతో మృతదేహాన్ని పాత్రునివలస రామిగెడ్డలో పడేశారు. అక్కడి నుంచి సుమారు 4 కిలోమీటర్ల దూరం కొట్టుకుపోయి గుర్రపుడెక్కల మధ్యలో మృతదేహం చిక్కుకుపోయింది. గుప్తా వద్ద దోచుకున్న బంగారంలో సంతోష్, రాజులు ఒకరు 60శాతం, మరొకరు 40శాతం తీసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

అదృశ్యం ఫిర్యాదుతో..

గుప్తా కనిపించడం లేదని కుటుంబ సభ్యులు నరసన్నపేట పోలీసులను ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు నిర్వహించారు. మృతిచెంది ఉండవచ్చనే సమాచారం మేరకు శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్ఎఫ్, క్రైం పోలీసులు మూడు బృందాలుగా విడిపోయి మూడు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనా స్థలానికి సీఐలు పైడపునాయుడు, శ్రీనివాసరావు, ఎస్ఐ రాము చేరుకుని మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.


రామిగెడ్డలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పోలీసుల అదుపులో నిందితులు!

గుప్తాను హత్యచేసిన ఉదంతంలో నరసన్నపేట పోలీసులు డ్రైవర్ సంతోష్, కారు డెకార్స్ యజమాని రాజును అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

కరెన్సీ వినాయకుడు..


కరెన్సీ నోట్లతో ఆకట్టుకుంటున్న వినాయకుడు

భోగాపురం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పోలిపల్లి నాయుడు వారి వీధిలో ఏర్పాటు చేసిన గణనాథుడ్ని లక్షా యాభై వేల రూపాయల కరెన్సీ నోట్లతో శుక్రవారం అలంకరించారు. దీంతో వినాయకుడ్ని చేసేందుకు పలు గ్రామాల నుంచి భక్తులు వచ్చారు. భక్తి భావనతో పాటు వినూత్న ఆలోచనకు ప్రతీకగా గణనాథుడుని కరెన్సీతో అలంకరించినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

సహస్ర దీపారాధన


స్వామి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపారాధన శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామి వారికి ప్రాతఃకాలార్చన చేసినానంతరం యాగశాలలో విశేష హోమాలు చేశారు. అనంతరం వెండి మండపం వద్ద సీతారాముల నిత్యకల్యాణ మహోత్సవాన్ని వేడుకగా జరిపించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామి విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మండపం వద్దకు తీసుకువచ్చి, అక్కడి ప్రత్యేక ఊయలలో ఆశీనులను చేశారు. అనంతరం సహస్ర దీపాలు వెలిగించి ఆ దీపాల కాంతుల శోభలో స్వామికి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వింత వ్యాధితో కోళ్లు మృతి


మృతి చెందిన కోళ్లు

గుర్ల: మండలంలోని పకీరుకిత్తలిలో రాగోలు రామునాయుడుకు చెందిన వివిధ జాతులకు చెందిన 50 కోళ్లు వింత వ్యాధితో శుక్రవారం మృతి చెందాయి. వీటితో పాటు గ్రామంలోని మరికొంత మంది రైతులకు చెందిన 50 నాటు కోళ్లు కూడా మృత్యువాత పడ్డాయి. రాత్రికి రాత్రే కోళ్లు మృతి చెందడంతో పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి సతీష్ మృతి చెందిన కోళ్లను పరిశీలించి ల్యాబ్‌కు పంపించారు. రిపోర్టు వచ్చాక కోళ్లు ఎందుకు మృతి చెందాయో తెలుస్తుందని చెప్పారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగుల సంఘ నాయకులు

విజయనగరంఫోర్ట్: 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వారంతా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయమై వారు జిల్లా కేంద్రంలో ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కుప్పిలి సాయిరాం, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సూర్యనారాయణలను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం నుంచి తగ్గించిన జీతాలను బకాయిలతో సహా ఇప్పించాలని డిమాండ్ చేశారు. అలాగే నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా ఉద్యోగులకు వేతనాలు పెంచాలన్నారు. ప్రతి ఉద్యోగికి శ్లాబ్ సిస్టమ్ అమలు చేయాలన్నారు. చట్ట ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులకు ఇవ్వాల్సిన క్యాజువల్ లీవులు, పబ్లిక్ హాలిడేస్, గుర్తింపుకార్డులు, పేస్లిప్‌లు వంటివి వర్తింపజేసి అందివ్వాలన్నారు. వాహనాలకు సరిపడ సిబ్బందిని కూడా నియమించాలన్నారు. కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం నాయకులు రామరాజు, జగన్, బంగారుప్పుడు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹141	₹252	₹262

టీడీపీలో వర్గపోరు..

- తమకు గుర్తింపు లేదన్న టీడీపీ మండల అధ్యక్షుడు రవికుమార్
- పార్టీ నాయకులు, కార్యకర్తలతో అలమండలో సమావేశం
- ఎమ్మెల్యే కోళ్ల తీరుపై నిరసన
- పార్టీ అధిష్టానం దృష్టికి సమస్యలు


మాట్లాడుతున్న టీడీపీ మండలాధ్యక్షుడు లగుడు రవికుమార్


సమావేశానికి హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

జామి: టీడీపీలోని వర్గవిభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. ఎన్నికల సమయంలో తమను వాడుకుని తీరా అధికారం వచ్చాక కరివేపాకులా తీసి పడేశారని జామి మండల అధ్యక్షుడు లగుడు రవికుమార్, తదితరులు ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తీరుపై మండిపడ్డారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో మండలంలోని అలమండలో శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు గొంప కృష్ణ ఎమ్మెల్యే టికెట్‌కు ప్రయత్నించగా.. ఆయనకు మద్దతు తెలిపామనే కక్షతో ఎమ్మెల్యే కోళ్ల తమను అణగదొక్కుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా కోళ్ల లలితకుమారిని ప్రకటించినప్పుడు.. విశాఖ ఎంపీ భరత్, తదితర పెద్దలు కోళ్ల గెలుపుకోసం కృషి చేయాలని, కష్టపడి పనిచేసిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చిన విషయం ఈ సందర్భంగా గుర్తు చేశారు. దీంతో తాము ఎంతో కష్టపడి పార్టీ గెలుపుకోసం పనిచేసినట్లు చెప్పారు. అనుకున్న ప్రకారం ఎన్నికల్లో కోళ్ల లలితకుమారి గెలిచిందని.. అయితే తమను మాత్రం పూర్తిగా పక్కనబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా మండలంలో వేరే వర్గాన్ని తయారు చేసి ప్రోత్సహిస్తున్నారన్నారు. పార్టీ కష్టకాలంలో జెండా మోసిన తమను కాదని.. వేరే వారిని ప్రోత్సహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో అలమండలో మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల ఏర్పాటుకు లలితకుమారి హామీ ఇచ్చి.. ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము కలెక్టర్‌ను కలిసి కొన్ని పనులు మంజూరు చేయించుకుంటే ఎమ్మెల్యే వాటిని అడ్డుకున్నారని వాపోయారు. మండలంలో ఏ కార్యక్రమం జరిగినా తమకు సమాచారం ఇవ్వడం లేదన్నారు. తన తండ్రి లగుడు సింహాద్రి జెడ్పీ చైర్మన్‌గా పనిచేసినా 2021లో జరిగిన మహానాడులో కనీసం అతని పేరు ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. పార్టీ అధిష్టానం దృష్టికి ఈ అంశాలన్నీ తీసుకెళ్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇప్పాక వెంకట త్రివేణి, నాయుడు బాబు, బి.స్వామినాయుడు, బి.అప్పలనాయుడు, చిప్పాడ నాగరాజు, జాగరపు శ్రీను, రామకృష్ణ, డి.చినసత్యం, ఎర్ర శ్రీను, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఇదే..

సమావేశం అనంతరం పార్టీ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్. రవికుమార్, ఉపాధ్యక్షుడిగా వేంద్రపు నాయుడుబాబు, జనరల్ సెక్రటరీగా బండారు పెదబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా శిరికి చంద్రరావు, గూనూరు సంతోష్‌కుమార్, రంభ అవతారం, జె.జ్యోతి, కార్యదర్శులుగా బి.స్వామినాయుడు, దాసరి చినసత్యం, ట్రెజరర్‌గా చిప్పాడ నాగరాజు ఎంపికయ్యారు.

గణేష్ నిమజ్జనంలో అపశృతి

- చెరువులో పడి వ్యక్తి మృతి


కొంచాడ గణపతి మృతదేహం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలు గ్రామంలో గురువారం రాత్రి నిర్వహించిన గణేష్ నిమజ్జనోత్సవంలో అపశృతి చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తూ చెరువులో పడి కొంచాడ గణపతి (45) అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై గణేష్, స్థానికులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని నిమజ్జనోత్సవానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. విగ్రహాన్ని గ్రామ శివారులో ఉన్న గుండాల చెరువులో నిమజ్జనం చేసేందుకు యువకులంతా తీసుకెళ్తుండగా.. గ్రామానికి చెందిన కొంచాడ గణపతి తన ఫోన్‌ను చెరువు గట్టుపై ఉన్న నీలా కుమార్ అనే వ్యక్తికి ఇచ్చి చెరువులో దిగి కూరుకుపోయాడు. అయితే ఈ సంఘటనను ఎవ్వరూ గుర్తించలేకపోయారు. ఎంతకీ గణపతి రాకపోవడంతో ఇంటికి వెళ్లిపోయి ఉంటాడని భావించిన కుమార్ మొబైల్‌ను వారి కుటుంబ సభ్యులకు అప్పగించాడు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చెరువు వద్దకు చేరుకుని వెతకగా.. గణపతి మృతదేహం కనిపించింది. మృతుడికి భార్య పావని, ఇద్దరు కుమార్తెలున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యన్నపేటలో ఒకరు..


రాజు మృతదేహం

విజయనగరం క్రైమ్: విజయనగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అయ్యన్నపేటకు చెందిన రాజు (34) అనే యువకుడు చెరువులో పడి మృతి చెందాడు. సీఐ ఆర్‌వీకే చౌదరి తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుడ్ని గురువారం రాత్రి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా సహచర స్నేహితులతో కలిసి రాజు నిమజ్జనోత్సవంలో పాల్గొన్నాడు. విగ్రహాన్ని చెరువులో నిమజ్జనం చేసే క్రమంలో అందరితో పాటే చెరువులో దిగాడు. అయితే అందరూ పైకి వచ్చినా రాజు జాడ కనిపించలేదు. దీంతో గ్రామస్తులకు సమాచారం ఇచ్చి అందరూ వెతికారు. సమాచారం తెలుసుకున్న ఎస్డీఆర్, పోలీసులు శుక్రవారం ఉదయం గ్రామానికి చేరుకుని సుమారు 12 గంటలు గాలింపు చేపట్టగా రాజు మృతదేహం లభించింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చౌదరి తెలిపారు.

ఈ చెరువు ఎవరి సొంతం..?


ఆక్రమణను ఖండిస్తూ చెరువులో దిగి నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు (ఫైల్)

- తనదే అంటున్న గ్రామస్తుడు, కాదంటున్న ప్రజలు
- పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసిన గ్రామస్తులు
- తహసీల్దార్ కార్యాలయంలో నేడు విచారణ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లి కాలనీ వద్ద ఉన్న ఓ చెరువు పొలిటికల్ హీట్‌ను పెంచుతోంది. నెల్లిమర్ల - రణస్థలం ప్రధాన రహదారి పక్కన సర్వే నంబర్-72లో 2.40 ఎకరాల స్థలం పూర్వం నుంచి ఓ చెరువును పోలి ఉండేది. మూడేళ్ల కిందట వరకు ఆ చెరువు ఖాళీగానే ఉండేది. అప్పట్లో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చెరువు తనదేనంటూ చదును చేయడానికి ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. అప్పటి తహసీల్దార్ రాము సైతం చెరువుపై ఎవరికీ యాజమాన్య హక్కు లేదని ప్రకటించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఇటీవల గ్రామస్తులు ఇంటికి కొంత నగదు సేకరించి చెరువును బాగు చేసుకున్నారు. దీంతో మళ్లీ సదరు వ్యక్తి ఆ స్థలం తనదని అడ్డుకునే ప్రయత్నం చేయగా ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. అనంతరం గ్రామస్తులు చెరువు ఆక్రమణ అడ్డుకోవాలని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తి కూడా తనదే ఆ స్థలం అంటూ అధికారులను ఆశ్రయించాడు. ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం ఆ స్థలం జిరాయితీ భూమిగా ఉందని ప్రస్తుత తహసీల్దార్ శ్రీకాంత్ స్పష్టం చేశారు. ఈ విషయం కాస్తా పీజీఆర్ఎస్‌కు చేరడంతో చెరువు అంశం ప్రస్తుతం పొలిటికల్ టర్న్ తీసుకుంది. సదరు వ్యక్తి తరఫున కొంత మంది టీడీపీ అగ్రనాయకులు రంగ ప్రవేశం చేసి కేసులు పెడతామంటూ బెదిరింపులకు దిగుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాగా ఈ తగాదాపై అధికారులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం పంచాయితీ ఏర్పాటు చేశారు. ఈ విషయమై ఇరువర్గాలకు సమాచారం అందించామని తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. ఈ చెరువు ఎవరి సొంతమో పంచాయితీలో తేలిపోనుంది.

రోగులకు తప్పని ఇక్కట్లు..

- సర్వజన ఆస్పత్రిలో అందుబాటులో లేని థైరాయిడ్ నిర్ధారణ పరీక్షలు
- తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ ల్యాబ్‌లకు పరుగు
- రోగులకు వదులుతున్న చేతిచమురు


సూర్యకుమారి

విజయనగరం ఫోర్ట్: పక్క ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు బి.సూర్యకుమారి. ఈమెది భోగాపురం ప్రాంతం. చర్మ సంబంధిత సమస్యతో శుక్రవారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చింది. ఇక్కడి వైద్యులు ఆమెను పరీక్షించి థైరాయిడ్ పరీక్ష చేయించుకోవాలని చీటి రాసి ఇచ్చారు. అది పట్టుకుని ఆస్పత్రిలోని లేబరేటరీ వద్దకు ఆమె వెళ్లగా..ఇక్కడ థైరాయిడ్ పరీక్ష జరగడం లేదని సిబ్బంది బదులిచ్చారు. బయట ప్రైవేట్ ల్యాబ్‌లో చేయించుకోవాలని సూచించారు. ఈ పరిస్థితి ఈమె ఒక్కరిదే కాదు. నిత్యం అనేక మంది రోగులకు ఈ పరిస్థితి ఎదురవుతోంది. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో థైరాయిడ్ నిర్ధారణ పరీక్షలు చేయక పోవడం వల్ల రోగులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోందని రోగులు చెబుతున్నారు. ఇదే అదునుగా ల్యాబ్ నిర్వాహకులు ఒక్కో రోగి నుంచి రూ. 500 నుంచి 800 రూపాయల వరకు వసూల చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో థైరాయిడ్ నిర్ధారణ పరీక్షలు చేయకపోవడంపై పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.


లేబరేటరీ వద్ద వైద్య పరీక్షల కోసం రిజిస్ట్రేషన్ చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

చర్యలు తీసుకుంటా..

నేను ఈ రోజే బాధ్యతలు స్వీకరించాను. ఎందువల్ల థైరాయిడ్ నిర్ధారణ పరీక్షలు జరగడం లేదో తెలుసుకుంటాను. రెగ్యులర్‌గా పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకుంటాను.

– అల్లు పద్మజ, సూపరింటెండెంట్ , ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

రోజుకు15 నుంచి 20 మంది వరకు ..

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్, డెంటల్, డెర్మటాలజీ, పలమనాలజీ, జనరల్ సర్జరీ, ఎముకల విభాగం , న్యూరో మెడిసిన్, న్యూరో సర్జరీ, ఈఎన్‌టీ, నెఫ్రాలజీ, యురాలజీ, తదితర విభాగాలున్నాయి. ఓపీ విభాగాల్లో రోగులను పరీక్షించిన వైద్యులు థైరాయిడ్ వ్యాధి లక్షణాలు ఉన్న వారికి పరీక్ష చేయించుకోవాలని చీటీలు రాసి ల్యాబ్‌కు పంపిస్తారు. ఇలా రోజుకు 15 నుంచి 20 మంది రోగులకు థైరాయిడ్ నిర్ధారణ పరీక్షలు అవసరమవుతాయి. రెండు వారాలుగా థైరాయిడ్ పరీక్షలు జరగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



పరీక్ష కోసం వైద్యులు రాసిన చీటీ

క్రైం కార్నర్..

రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


యువకుడి మృతదేహం

బొండపల్లి: మండలంలోని బొండపల్లి - గరుడబిల్లి రైల్వేస్టేషన్ల మధ్యలో రైలు ఢీ కొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని జీఆర్‌పీ హెచ్‌సీ బి. ఈశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. తమకు అందిన సమాచారం మేరకు పట్టాలపై వెళ్లి చూడగా సుమారు 30 సంవత్సరాల యువకుడి తీవ్ర గాయాలతో మృతి చెంది ఉన్నాడని చెప్పారు. మృతుడు పసుపు రంగు టీ షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించాడని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రికి తరలించామని, వివరాలు తెలిసిన వారు 94906 17089, 94918 13163 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని మరొకరు..


మృతి చెందిన నాగరాజు మృతదేహం

బొండపల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు సమీపంలో గుర్తు తెలియని వాహనం ట్రాలీ రిక్షాను ఢీ కొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై యు. మహేష్ తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. గజపతినగరం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన శిర నాగరాజు (42) బొండపల్లి మండలంలోని బోడిసింగిపేటలో జరిగిన వినాయక నిమజ్జనోత్సవానికి ట్రాలీ తీసుకెళ్లాడు. నిమజ్జనం అయిన తర్వాత తిరిగి ఇంటికి వెళ్తుండగా..బొండపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో వెనుకనుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం రిక్షాను ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన నాగరాజును జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొదుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య గౌరి, ఇద్దరు పిల్లలున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..


శ్రీనివాసరావు(ఫైల్)

చీపురుపల్లి: కొద్ది రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడిన పట్టణంలోని హడ్కో కాలనీకి చెందిన నాదెళ్ల శ్రీనివాసరావు విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఆగస్టు 29న శ్రీనివాసరావు తన స్నేహితుడు మదీనాతో కలిసి తన ఫొటో స్టూడియో నుంచి హడ్కో కాలనీలోని ఇంటికి వెళ్తుండగా.. గరివిడి నుంచి చీపురుపల్లి వైపు వస్తున్న ద్విచక్ర వాహనదారుడు ఢీ కొట్టాడు. దీంతో శ్రీనివాసరావు తలకు తీవ్ర గాయాలు కాగా.. వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయనగరం మహారాజా ఆస్పత్రికి అక్కడ నుంచి విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాసరావు కన్నుమూశాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

- డీఎస్పీ భవ్యారెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి వెనుక ముసుగులో నిందితులు

గజపతినగరం రూరల్: మండలంలోని కొత్తబగ్గాం గ్రామంలో ఈనెల 2వ తేదీన జరిగిన హత్య కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆమె మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన పసుపురెడ్డి శ్రీను, పసుపురెడ్డి చంటితో పాటు మరో ఇద్దరు మండల పరిధి కొణిశ గ్రామంలోని మద్యం దుకాణం వద్ద ఈ నెల 2వ తేదీన వాదులాడుకున్నారన్నారు. వాగ్వాదం అనంతరం పసుపురెడ్డి చంటి తన అన్నయ్య పసుపురెడ్డి శ్రీనును ఎలాగైనా అంతం చేయాలని నిర్ణయించుకుని ఇంటికి వెళ్లి కత్తి తీసుకువచ్చి గ్రామ సమీపంలోని రోడ్డు పక్కన చీకట్లో మాటువేశాడని తెలిపారు. ఇంతలో శ్రీను ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. వెంటనే ఆపి పక్కనే ఉన్న పొలాల్లోకి తీసుకెళ్లి కత్తితో పొడిచి హత్య చేశాడని చెప్పారు. ఈ హత్యకు సంబంధించి పసుపురెడ్డి చంటికి అతని మిత్రుడు గుమ్మడి రామ చంద్రుడు సహకరించడంతో ఇద్దరినీ గజపతినగరం రైల్వేస్టేషన్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐ రమణ, ఎస్సై కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భార్యాభర్తల ఆత్మహత్యాయత్నం..


రాజాం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న భార్య సాయి

వంగర: మండల పరిధి మడ్డువలస పంచాయతీ జగన్నాథవలస గ్రామానికి చెందిన భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన గంధం చిన్నకు ఈ ఏడాది ఫిబ్రవరిలో శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం గొబ్బూరు గ్రామానికి చెందిన సాయితో వివాహం జరిగింది. అయితే తన భర్తకు అక్రమ సంబంధం ఉందనే అనుమానంతో భార్య కన్నవారింటికి వెళ్లిపోయింది. అనంతరం జి.సిగడాం పోలీస్‌స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు కూడా చేసింది. ఈక్రమంలో పెద్దలు జోక్యం చేసుకుని భార్యాభర్తలకు సర్దిచెప్పారు. దీంతో వారిద్దరూ జగన్నాథవలసలో ఉంటుండగా.. తాజాగా తన భర్త అక్రమ సంబంధం పెట్టుకున్న మహిళతో మాట్లాడాడని అనుమానిస్తూ సాయి శుక్రవారం ఉదయం గడ్డి మందు తాగేసింది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె భర్త చిన్న కూడా గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి వారిద్దరినీ రాజాం సీహెచ్‌సీకి తరలించారు. ఏఎస్సై సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక రేపు

విజయగనరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికలు ఈ నెల 7న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు నగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో జరగనున్న ఎంపిక పోటీల్లో 2011 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించిన క్రీడాకారులు సబ్ జూనియర్స్ విభాగంలో.. 2007 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించిన క్రీడాకారులు జూనియర్స్ విభాగంలో జరిగే పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 13 నుంచి 14వ తేదీ వరకు కోనసీమ జిల్లా మండపేటలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల రాత పరీక్ష రేపు


మాట్లాడుతున్న డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి

- పక్కాగా ఏర్పాట్లు : డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి

విజయనగరం అర్బన్: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈ నెల 7న నిర్వహించనున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్ల రాత పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి ఆదేశించారు. ఈ పరీక్షకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ రోజు ఉదయం జరిగే బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ల రాత పరీక్షకు 6,308 మంది.. మధ్యాహ్నం జరగనున్న సెక్షన్ ఆఫీసర్ల పరీక్షకు 910 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దీని కోసం విజయనగరంలోనే మొత్తం 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అభ్యర్థులను గంట ముందే కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. హాల్ టిక్కెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డును కూడా తప్పనిసరిగా తీసుకురావాలని చెప్పారు. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించమని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ విధించాలని.. తాగునీరు, వైద్యసదుపాయం కల్పించాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లదే కీలక బాధ్యతని స్పష్టం చేశారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ బాబూరావు, సెక్షన్ ఆఫీసర్ ప్రసాద్, కలెక్టరేట్ సూపరింటిండెంట్ భాస్కరరావు, ఆయా ప్రభుత్వ శాఖల ప్రతినిధులు, లైజనింగ్ అధికారులు, సెంటర్ చీఫ్ సూపరింటిండెంట్లు పాల్గొన్నారు.

ఏఐటీ టెస్ట్‌లో ఐటీఐ విద్యార్థుల ప్రతిభ


ఎర్ల సాయి (ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్‌లో 600/600)

విజయనగరం అర్బన్: ఆల్ ఇండియన్ ట్రేడ్ టెస్ట్-2025 ఫలితాల్లో విజయనగరం ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులు ప్రతిభ చూపారు. సీనియర్ ఎలక్ట్రీషియన్ విభాగానికి చెందిన ఎర్ల సాయి 600/600 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. అదే విభాగంలో ఓ.శ్రీరాంసందీప్ 598/600, ఎల్.రఘునాథ్ 597/600, వై.ప్రణీత్ 596/600, డి.జయకిరణ్ 594/600, సాయి చైతన్య 590/600 మార్కులు లభించాయి. జూనియర్ ఎలక్ట్రీషియన్ విభాగంలో జెవీడీ చక్రధర్ 598/600, ఎస్.వరప్రసాద్ 591/600 మార్కులు సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా ఐటీఐ ప్రిన్సిపాల్ టి.వి.గిరి మాట్లాడుతూ ఏఐటీ ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ చూపడం ఆనందంగా ఉందన్నారు. ఇన్‌స్ట్రక్టర్ శ్రీధర్ కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మంచి మార్కులు సాధించగలిగారని తెలిపారు. విద్యార్థులను కళాశాల బోధన సిబ్బంది అభినందించారు.